ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025 5

అనంతపురం





వర్షపునీరు వెళ్లడానికి జెసిబితో చెత్త తొలగిస్తున్న దృశ్యం

సాగునీటి నిర్వహణలో సమస్య తలెత్తనివ్వొద్దు

ఐఎబి సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

సాగునీటి నిర్వహణలో ఎక్కడా సమస్యలు రాకుండా చూసుకోవాలని నీటి పారుదలశాఖ అధికారులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం కలెక్టరు ఒ.ఆనంద్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు విప్ కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, జెసి అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా నీటి లభ్యత గురించి హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఇలు వివరించారు. తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ ఈ ఏడాది 80 టిఎంసిల వరకే చేపట్టాలని బోర్డు నిర్ణయించిన నేపథ్యంలో ఈ ఏడాది 24 టిఎంసిల వరకే నీరు తీసుకునేందుకు వీలుందని ఎస్‌ఇ వివరించారు. ఇప్పటి వరకు 16 టిఎంసిల వరకు తీసుకున్నట్టు వివరించారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్, విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ మిగిలిన ఎనిమిది టిఎంసిల నీళ్లను జనవరి ఆఖరు వరకు వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అంతలోపు నీరు తీసుకోవడం పూర్తయితే ఎగువ భాగంలోనున్న తుంగభద్ర ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కిందనున్న ఆయకట్టు రైతులకు ఇబ్బంది ఉంటుందని చెప్పారు. పంటలను పూర్తి స్థాయి సంరక్షించే విధంగా కలెక్టరు ఆధ్వర్యంలో మరోసారి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. పంటలకు చివరి వరకు నీరు ఇవ్వలేకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. హంద్రీనీవా ఎస్‌ఇ స్వరూప్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హంద్రీనీవా నుంచి 19 టిఎంసిల నీరు జిల్లాకు వచ్చిందన్నారు. ఇందులో 6.128 టిఎంసిలు నీరు పిఎబిఆర్‌కు ఇచ్చామని తెలిపారు. 10.284 టిఎంసిలు రెండో దశకు నీరు ఇచ్చినట్టు చెప్పారు. అనంతపురం జిల్లా పరిధిలో 42 చెరువులకు నీరిచ్చామని తెలిపారు. సత్యసాయి జిల్లాలో 175 చెరువులకు నీరిచ్చేందుకు ప్రణాళిక చేశామన్నారు. ఇందులో ఇప్పటికే 40 చెరువులు పూర్తయ్యాయి. 30 చెరువులకు నీరుస్తామని వివరించారు. ఇంకో 107 చెరువులకు నీరివ్వాల్సి ఉందన్నారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూలేని విధంగా 40 టిఎంసిలకు పైగా నీటిని తీసుకొచ్చేందుకు వీలుందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు అందుకు తగ్గట్టు అధికారులు పనిచేయాలని చెప్పారు. అదే విధంగా వచ్చే ఏడాది హంద్రీనీవా కాలువ వెడల్పును రెండో వైపు చేయడానికి వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మిడ్‌పెన్నార్ ఉత్తర కాలువ కింద ఆయకట్టుకు నీరందించే డిస్ట్రిబ్యూటరీల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. అదే విధంగా చాగల్లు కింద ఆయకట్టు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉందని అన్నారు. ఇవి చేయగలిగితే 80 వేల ఎకరాలకుపైగా పంటలు పండించేందుకు వీలుంటుందని చెప్పారు. మిడ్‌పెన్నార్ డ్యామ్ మరమ్మతులకు నిధులు విడుదల చేసినందుకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ధన్యవాదాలు తెలిపారు. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద నీరు ఎప్పటి వరకు ఇస్తారన్న దానిపై షెడ్యూల్ ఇప్పటి వరకు ప్రకటించలేదని, ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఎప్పుడు జులైలో జరిగేది, ఇప్పుడు అక్టోబరులో నిర్వహిస్తున్నారని అన్నారు. ఇక నుంచి ఆలస్యం లేకుండా సకాలంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎల్‌ఎంసిపైన ఎగువ భాగంలో ఒక రిజర్వాయర్ నిర్మిస్తే హెచ్‌ఎల్‌ఎంసి ఆయకట్టుకు సమస్య ఉండబోదని సూచించారు. ఇప్పుడు ఆర్థికశాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ ఉన్నందున జిల్లాకు సాగునీటికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హెచ్‌ఎల్‌సి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, సాగునీటి సలహా మండలి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, తదితరులు



ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు



ఇళ్లమధ్యలో ప్రవహిస్తున్న వర్షపునీటిలో వెలుతున్న వాహనదారులు

'అనంత' జలమయం

లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు
ఇబ్బందుల్లో ప్రజలు
అధికారుల, పాలకుల తీరుపై ఆగ్రహం



చెరువును తలపిస్తున్న విశ్వశాంతి నగర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గురువారం రాత్రి కురిసిన వర్షానికి అనంత నగరం, రూరల్ కాలనీలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండ కాసి ఉన్న ఫలంగా సాయంత్రానికి ఉరుములతో వర్షం కురిసింది. దీంతో నగరంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని గుల్జార్‌పేట, కోవూరు నగర్, లక్ష్మినగర్, నడిమివంక పరివాహక ప్రాంతాలు, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, వడ్డే కాలనీ, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, ఆలమూరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రజలు నివసిస్తున్న ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చిన వారు తిరిగి ఇళ్లకు చేరడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర వాతావరణ శాఖ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సమస్యాత్మక ప్రాంతాలకు చేరి జేసిబి తదితర యంత్రాల సహాయంతో నిలిచిపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి నీరు కింది ప్రాంతానికి వెళ్లేలా చూశారు. లోతట్టు ఇళ్లలో ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించి సమీప సచివాలయాల్లో తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. వర్షం కురిసిందంటే కొన్ని కాలనీల్లో నీట మునిగే దుస్థితి నెలకొంది. వీటికి కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికి శాశ్వత పరిష్కారం చూపడంలో అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం ఆ తరువాత మరచిపోవడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు రాకుండా జాగ్రత్తలు సదుపాయాలు కల్పించాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు. విశ్వశాంతి నగరంలో నీట మునిగి ప్రమాదంలో చిక్కుకుపోయిన ప్రజలను అగ్ని మాపక శాఖ అధికారి నేతృత్వంలో సిబ్బంది రక్షించారు. రుద్రంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు సాయం అందించారు. రిషిత పబ్లిక్ స్కూల్ బ్రిడ్జి వద్ద తలెత్తిన సమస్యపై సిపిఎం నాయకులు నగర పాలక సంస్థ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేయడంతో మేయర్, కమిషనర్ అక్కడకు చేరుకుని యంత్రాలు, సిబ్బంది సహాయంతో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి నీరు కిందకు వెళ్లేలా చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు చేస్తున్న తరుణంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో నగరంలో కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన అనుభవం ఉన్నప్పటికి ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతునే ఉన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యల పరిష్కారానికి మరోసారి చర్చలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యల పై మరోసారి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో చర్చలు జరుపుదామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు అన్నారు. ఈ మేరకు ఆయన తాగునీటి కార్మికుల సమస్యలపై సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, స్థానిక డివిజన్ నాయకులు రంగనాథ్‌లతో కలిసి శుక్రవారం స్థానిక ప్రజావేదికలో టీడీపీ నాయకుడు ధర్మతేజతో చర్చలు జరిపారు. చర్చల అనంతరం సమావేశమైన కార్మికులతో సిఐటియు నాయకులు మాట్లాడారు. వేతనాలు, కార్మికుల కొనసాగింపు, ఇతరాత్ర విషయాలపై చర్చించిన్నట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ సమక్షంలో మరోసారి చర్చలు జరిపి డిమాండ్లకు పరిష్కారం తెచ్చుకుందామన్నారు. మరోసారి చర్చల్లో జరిగే అంశాలను బట్టి ఉద్యమాలకు శ్రీకారం చుట్టడమా....సానుకూలంగా పరిష్కారమైతే యదావిధిగా విధులకు హాజరుకావడమా అన్నది తేలుతుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగానే చర్చలు జరుపుతామని కొత్త విషయాలకు తావుండదని స్పష్టం చేశారు. కార్మికులంతా ఐక్యతగా ఉంటూ డిమాండ్ల సాధనకోసం ముందుకుసాగాల్సిన అవసరం వుంటుందన్నారు. ఈ సమావేశంలో తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, హరీష్, ఓబుళపతి, హనుమంతరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తత అవసరం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతరాత్రి వర్షం కురిసిన సమయంలో అధికారులు, పోలీసులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాగా స్పందించారన్నారు. అర్ధరాత్రి వేళలో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా కాల్వల వద్ద చర్యలు చేపట్టారన్నారు. అయితే వర్షాలు ఇంకా ఎక్కువగా ఉన్నాయని.. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు. నడిమివంక, మరువ వంక, నగర శివారు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎక్కడైనా పూడిక ఎక్కువగా ఉన్నా.. ప్రవాహానికి అడ్డంకులు ఉన్నా అక్కడ పనులు చేపట్టాలన్నారు. నగరంలో వంకల చుట్టూ ఆక్రమణలు ఉన్నాయని.. దాని వలనే ముంపు సమస్య వస్తోందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పూర్తి స్వేచ్ఛనిచ్చినా ఎందుకు స్పందించలేదన్నారు. ప్రస్తుతం ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలతో వాటిని పట్టించుకోకుండా ఉండొద్దని.. భవిష్యత్‌లో వచ్చే పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. శానిటేషన్ పై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని.. దీనిపై ఎన్నిసార్లు చెప్పిన తీరు మారడం లేదన్నారు. ఇలా ఉంటే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రజల సహనానికి పరీక్ష పెట్టొద్దు

విపత్తు ప్రమాద నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి
నడిమివంక మురుగు నీళ్లలో దిగి నిరసన



నడిమివంక మురుగునీళ్లలో దిగి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వర్షం కురిసినప్పుడల్లా నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవిస్తున్నారని ప్రజల సహనానికి పరీక్ష పెట్టకుండా ప్రకృతి విపత్తు ప్రమాదాల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు కాలనీలు జలమయమై ప్రజలు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో నడిమి వంక మురికి నీళ్లలో దిగి నిరసన చేపట్టారు. నడిమి వంక సైడ్ వాల్ నిర్మించాలని, రిషితా పబ్లిక్ స్కూల్ దగ్గర బ్రిడ్జిని వేయాలని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర ఉన్న బ్రిడ్జి పొంగి పొర్లుతోందన్నారు. జెసిబిలను పంపించి బ్రిడ్జికి అడ్డం పడిన చెత్త చెదారాన్ని తొలగించాలని సిపిఎం నాయకులు కోరడంతో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, మేయర్ వసీం సమస్య పరిష్కరించారని తెలిపారు. రెండు జెసిబిలతో 10 గంటలు పని చేసి దాదాపు 30 ట్రాక్టర్ల చెత్తను తొలగించారని, ఇంకా అక్కడ ఉన్న చెత్తాచెదారం పూర్తి కాలేదని అన్నారు. వంకల పట్ల పాలకులకు ఏ విధమైన శ్రద్ధ ఉందో అర్థమవుతుందని విమర్శించారు. చిన్నపాటి వర్షం వచ్చినా పది డివిజన్‌లు, 12 కాలనీలలో నివసిస్తున్న వందల కుటుంబాల ప్రజలు రాత్రింబవళ్లు నిద్ర లేకుండా జాగారం చేస్తున్నారని తెలిపారు. అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిషితా పబ్లిక్ స్కూల్ దగ్గర ఉన్న బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలో టెండర్లను పిలిచి ఎందుకు పనులు చేయించలేదని ప్రశ్నించారు. ప్రజలు ఎమ్మెల్యే వస్తే తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశతో ఉన్నారని, ఎమ్మెల్యే ఎప్పుడు అనంతపురంలో ఉంటాడో తెలియడం లేదని అన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని గతంలో సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటిని కోరగా రూ.120 కోట్ల నిధులు వస్తున్నాయని ఆ నిధులు వచ్చినప్పుడు ఈ బ్రిడ్జిని నిర్మిస్తామని చెబుతున్నారని తెలిపారు. ఆ నిధులు ఎప్పుడు వస్తాయో బ్రిడ్జి ఎప్పుడు నిర్మిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. బ్రిడ్జి నిర్మించాలని గతంలో అనేకమైన ఆందోళనలు చేసిన పాలకులకు ఎటువంటి స్పందన లేదన్నారు. అధికారులను నిలదీస్తే ఇది ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వారి పని అని వారి ద్వారా ఈ బ్రిడ్జి నిర్మించుకోవాలని చెబుతున్నారని అన్నారు. నడిమి వంకలో చెత్త తీసినప్పుడల్లా ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారో వివరాలు బయటపెట్టాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో ఈ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, నగర కమిటీ సభ్యులు రాజు, జీవ, గఫూర్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షులు గిరి, భీమేష్, గణేష్, కాలనీవాసులు వెంకటేష్, రామాంజి, ఆచారి, సునీత, పెద్ద బీబీ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి నివారణకు చర్యలు

కలెక్టర్ ఓ.ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం

డ్రగ్స్, గంజాయి వంటి వాటిని అరికట్టేందుకు అన్నిశాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాలకు సంబంధించి ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి ఎన్‌సిఒఆర్‌డి జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సామాజిక సంక్షేమ శాఖ (ఎన్ఎంబిఒ), డిఎంహెచ్ఒ, జిజిహెచ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ శాఖ, డిఇఒ, ఆర్ఐఒ, ఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ విభాగం కలిసి విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డీ-అడిక్షన్ సెంటర్, ప్రిజన్ వార్డులను బలంగా ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్ వ్యసన బాధితుల పునరావాసానికి తరలించంఏదుకు సమర్థవంతంగా పని చేయాలని డిఎంహెచ్ఒ, జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ నిధులను (ఎన్ఎంబిఎ) డ్రగ్స్, గంజాయి అవగాహన కార్యక్రమాల కోసం సక్రమంగా, పారదర్శకంగా ఉపయోగించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణలో ఎస్పీతో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. డిఎంహెచ్ఒ తమ పరిధిలోని పిహెచ్‌సిలు, ఆశావర్కర్లు, ఎఎన్ఎంల ద్వారా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972, క్యూఆర్ కోడ్ విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఆర్అండ్‌బి ఎస్ఇ మురళీకృష్ణ, డిటిసి వీర్రాజు, పీడీ నేషనల్ హైవే తరుణ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామమోహన్‌రెడ్డి, డిఎంహెచ్ఒ ఇబి దేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, డివిఇఒ వెంకటరమణనాయక్, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, డిఇఒ ప్రసాద్‌బాబు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, ఎఫ్ఆర్ఓ శివరాం, జిజిహెచ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, జిల్లా సిరికల్చర్ అధికారి విజయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

బిటిపికి కృష్ణాజలాలు తీసుకొస్తాం

విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని



జలహారతి ఇస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాణితిప్ప ప్రాజెక్టును కృష్ణాజలాలతో నింపుతామని విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఈమేరకు శుక్రవారం టిబిపి జలాలలకు ఎమ్మెల్యేలు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది పూర్తిస్థాయిలో రెండు టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో రైతుల అభిప్రాయాలు తీసుకుని త్వరలో ఆయకట్టుకు నీటి విడుదల తేదీని ఖరారు చేస్తామన్నారు. దశాబ్ధాల కాలంగా ఈ ప్రాంత ప్రజల జీవితాలతో బీటీ ప్రాజెక్టు ఒక అనుబంధంలా ఉందన్నారు. కర్ణాటక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో బిటిపి ఎగువన వాణివిలాస్ ప్రాజెక్టు నిండిందన్నారు. దీంతో బిటిపికి క్రమంగా నీటి రాక పెరుగుతోందన్నారు. మూడు వేల క్యూసెక్కుల నీరు వస్తుందని అంచనా వేయగా కేవలం 600 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నట్లు వివరించారు. కర్ణాటక రాష్ట్ర పరిధిలో చెక్‌డ్యాములు, డైవర్షన్ చానల్స్ ద్వారా వారు చెరువులు నింపుకుంటున్నారన్నారు. 600 క్యూసెక్కుల నీరు ఇలాగే అందితే మరో ఆరురోజుల్లో పూర్తిస్థాయిలో రిజర్వాయర్‌కు నీరొస్తాయన్నారు. ఇకపోతే తామిద్దరం కృష్ణాజలాల తరలింపు అంశాన్ని పలుదఫాలుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వైసిపి హయాంలో ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈసారి బిటిపికి తప్పనిసరిగా కృష్ణాజలాలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బీటీపీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి గుమ్మగట్ట మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ దానవేంద్ర, సదాశివ, సాగునీటి సంఘం నాయకులు కాలవ నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి



తడిసిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం కూడేరు మండలంలోని కడదరకుంట గ్రామంలో వర్షాలకు తడిసిన పంట పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల నుండి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పంటలు తడిసిపోయి పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి అన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం వేరుశనగ పంట పొలంలోనే తడిసిపోయి మొలకలెత్తి బూజు పట్టిందన్నారు. వేరుశనగ పంట మొత్తం పెట్టుబడి కూడా గిట్టుబాటు కాదన్నారు. అందుకోసం తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే వేరుశనగ క్వింటా రూ.8వేలు, మొక్కజొన్నను రూ.3వేలతో కొనుగోలు చేయాలన్నారు. అలాగే నష్టపోయిన పంటలకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించాలన్నారు. దీపావళి కానుకగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ రూ.7వేల మొత్తాన్ని రైతుల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కరీంసాబ్, మండల నాయకులు వెంకటేశు, వీరప్ప, రాధాకృష్ణ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో 'వైట్ కోట్ వేడుక'



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025–26 బ్యాచ్ ఫస్ట్ ఎంబిబిఎస్ విద్యార్థుల కోసం శరీర నిర్మాణశాస్త్ర విభాగంలో శుక్రవారం 'కాడవరిక్ ఒత్, వైట్‌కోట్ వేడుక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అదనపు డిఎంఇ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు మృతదేహాలను గౌరవంతో చూడాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ షారన్‌సోనియా వైద్య వృత్తి సమాజానికి మానవసేవ చేయడానికి, ఆరోగ్యాన్ని అందించడానికి అవకాశం కలిగించే అత్యంత పవిత్రమైన వృత్తి అన్నారు. ముగింపు సమయంలో శరీర నిర్మాణశాస్త్ర విభాగంలోని డిసెక్షన్ హాల్లో విద్యార్థులు మానవ శరీర నిర్మాణాన్ని గౌరవం, గోప్యతతో అధ్యయనం చేయాలనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, అండర్ గ్రాడ్యుయేట్ కోఆర్డినేటర్, ఫార్మకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మశ్రావణి, శరీర నిర్మాణశాస్త్ర విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.నరేంద్రనాయక్, డాక్టర్ ఎస్.అహ్మద్‌పీర్, డాక్టర్ పి.పద్మజా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.షహజీర్, ట్యూటర్లు ఎం.పునర్జీవన్ కుమార్, ఓ.భాను, పీజీ విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం బాధ్యత

ఎఎస్పీ రోహిత్‌కుమార్‌-చౌదరి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎఎస్పీ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతిపౌరుడి బాధ్యత అని ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని జూటూరు గ్రామంలో ఉన్న జెసి దివాకర్‌రెడ్డి అగ్రికల్చర్ కళాశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీసులకు సహకరించి వారిచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో పోలీసులు చేసిన సేవలు మరువకూడదన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచనలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జానకినాథరెడ్డి, ఇన్స్‌పెక్టర్ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది జయన్న, నరసింహులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పులుసు వంకపై బ్రిడ్జి నిర్మించాలి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్




నీరు పారుతున్న వంకను పరిశీలిస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని తరిమెల గ్రామ సమీపంలో కల్లుమడి గ్రామానికి వెళ్లే దారిలో పులుసువంకపై బ్రిడ్జి నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గతరాత్రి కురిసిన వర్షాలకు పుసులువంకపై పారుతున్న నీటిని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తరిమెల–కల్లుమడి గ్రామాల మధ్య ఉన్న పులుసువంకపై మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు పారుతోందన్నారు. దీంతో అటు ప్రజలు, ఇటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పులుసువంకపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు



అనంతపురంలో వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్ నారాయణ, ముర్తుజా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడేళ్లుగా కార్మికులు చనిపోతున్నా వారిస్థానంలో కుటుంబ సభ్యులకు ఇంతవరకు ఉపాధి కల్పించలేదన్నారు. పెరిగిన నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, సకాలంలో పనిముట్లు అందజేయాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవ్, యూనిఫామ్ చెప్పులు కొబ్బరి నూనె, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 29తేదీ కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తరాజు, నల్లప్ప, ఇంజినీరింగ్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, లక్ష్మి, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యులు నారాయణ, ఎర్రిస్వామి, రాఘవేంద్ర, ప్రసాద్, కోనప్ప, పెన్నా నల్లప్ప, వరలక్ష్మి, ఇమాంబి, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, మున్సిపల్ యూనియన్ రంగనాయకులు, సామిల్, తిమ్మప్ప, హనుమంతు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్యం కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం చేస్తామని మున్సిపాలిటీ కార్మికుల యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, నగరాజ్, దుర్గమ్మ, హనుమంతు హెచ్చరించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో కార్మికులు హనుమంతు, ఆంజనేయులు, సురేష్, లక్ష్మీనారాయణ, కొమలమ్మ, గోవిందు, రమేష్, శివకుమర్ పాల్గొన్నారు.

అదానీ, గూగుల్ రెండూ మావే..

జగన్మోహన్‌రెడ్డిది అంతా ఫేక్ ప్రచారం - ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఆదాని డేటా సెంటర్ అయినా..ఇప్పుడొస్తున్న గూగుల్ డేటా సెంటర్ అయినా రెండు చంద్రబాబునాయుడు చొరవ వలనే వచ్చాయని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ రెండింటి తన ఖాతాలో వేసుకునేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం అనంతపురంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్.జగన్మోహనరెడ్డి తన జీవితకాలం తప్పుడు ప్రచారాలతోనే నెట్టుకొస్తున్నారని విమర్శించారు. డేటా సెంటర్ తన వలనే వచ్చిందని చెప్పుకునేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నాడన్నారు. 2019లోనే ఆదాని డేటా సెంటర్‌కు టిడిపి ప్రభుత్వ హయంలోనే ఒప్పందం జరిగిందని ఈమేరకు ప్రభుత్వ జీవోలు కూడా ఉన్నాయని అన్నారు. ఆ తరువాత ఇదే జీవోల్లో మార్పులు చేసి మూడు దఫాలుగా జీవోలను వైసిపి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అది కూడా పది మెగావాట్లు , 20 మెగావాట్లు అలా ఉన్నాయన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి వస్తున్న గూగుల్ డేటా సెంటర్ వెయ్యి మెగావాట్లు ఉంటున్నారు. ఇది రావడం వలన విశాఖపట్నం స్వరూపమే మారబోతోందన్నారు. దీని చుట్టూ పెద్దఎత్తున ఎఐ కేంద్రాలు రాబోతున్నాయన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లిక్కరులో నకిలీ మద్యం అమ్మకాలు ఏరకంగా చేయాలో తెలుసుగాని టెక్నాలజీ గురించి ఏ మాత్రం అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు గూగుల్ గురించి మాట్లాతున్నాడన్నా అది చంద్రబాబు వల్లనే అని వ్యాఖ్యానించారు. జగన్మోహన్‌రెడ్డి జీవితం మొత్తం తప్పుడు ప్రచారాలేనని విమర్శించారు. చివరాఖరుకు కర్నూలులో బస్సు ప్రమాదం జరిగితే దాన్నీ రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ఏ మాత్రం సంబంధంలేని ఆ బస్సు కర్నాటకకు చెందినదని చెప్పారు. ఆ బస్సుకు ఫిట్‌నెట్ లేదని కొన్ని మీడియా సంస్థలో వార్తలొచ్చాయన్నారు. అది నిజమా అని పరిశీలిస్తే ఆ బస్సుకు 2027 మార్చి వరకు పిట్‌నెట్ ఉందన్నారు. అంత మంది చనిపోయి బాధలో ఉంటే దాన్ని శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ఘటనల్లోనూ అటువంటి ప్రయత్నాలు చేయడం అమానవీయమన్నారు.

క్లైసిస్ సాఫ్ట్‌వేర్ కోచింగ్ సెంటర్ ప్రారంభం



జెఎల్ మురళీని సన్మానిస్తున్న క్లైసిస్ సాఫ్ట్‌వేర్ కోచింగ్ సెంటర్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన క్లైసిస్ సాఫ్ట్‌వేర్ ప్రయివేటు లిమిటెడ్ కోచింగ్, ట్రైనింగ్ సెంటర్‌ను అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, మేయర్ మహమ్మద్ వసీంసలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు జిల్లాగా పేరుగాంచిన అనంతపురంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షణీయమని అభినందించారు. మహానగరాలకు వెళ్లకుండానే స్థానికంగా నైపుణ్య శిక్షణ పొందే వేదికగా క్లైసిస్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్ నిలుస్తుందన్నారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్లు నామా వెంకట రాఘవేంద్ర, ఎన్.విక్రమ్‌చౌదరి, బుశిరెడ్డి మంజునాథరెడ్డి మాట్లాడుతూ 2017 హైదరాబాద్‌లో తమ కంపెనీ మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుంచి విజయవంతంగా నడుపుతున్నామన్నారు. ప్రస్తుతం అనంతపురంలోని నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ స్కిల్‌పై శిక్షణ ఇచ్చేందుకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో నిష్ణాతులైన అనుభవజ్ఞులైన నైపుణ్య సిబ్బందితో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాల అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రయివేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీతో రిలే దీక్షలు విరమణ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

భవిష్యత్తులో పట్టణంలో కార్పొరేట్ సెలూన్ దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేది లేదని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హామీ ఇవ్వడంలో క్షవర వృత్తిదారులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలను విరమించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్షవర వృత్తిదారులు మూడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం 4వ దీక్ష శిబిరం వద్దకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేరుకుని చర్చించారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో పట్టణంలో కార్పొరేట్ సెలూన్ దుకాణాలకు అనుమతి ఇవ్వమన్నారు. అంతేగాకుండా ఇప్పుడు ఉన్న కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ దీక్షలను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, అంజి, వాసు, నీల, చరణ్, బాల, శివ, భీమేష్, మస్తానయ్య, సాయి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

మనిషి మనుగడ కోసం పుట్టిందే కవిత్వం

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

మనిషి మనుగడ కోసం పుట్టిందే కవిత్వమని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, పీజీ కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో 21వ శతాబ్ది తెలుగు కవిత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం సాధించడమే ఆధునిక కవిత్వ లక్ష్యమన్నారు. ఉన్న సమాజం కంటే మరింత సుఖమైన జీవితం కోసం కవిత్వం అవసరమన్నారు. భవిష్యత్తు తరాలు ఆత్మగౌరవంతో బతకాలనే సదుద్దేశంతో రాసిన రానున్న కవిత్వమే ఆధునిక కవిత్వం అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, చక్రధర్‌రెడ్డి, కవులు కె.నాగేశ్వరాచారి, టి.రాజారామ్, ఎస్.షమీవుల్లా, ఎఐ శ్రీనాథ్, తెలుగు శాఖ అధ్యాపకులు ఈ.మురళీధర్, జి.రాకేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన

శాస్త్రీయ పరిజ్ఞానంతో సమస్యల పరిష్కారం

జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమ్మాయిలు తమ సమస్యలను శాస్త్రీయ పరిజ్ఞానంతో పరిష్కరించుకోవచ్చని జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం "ఎదిగే ఆడపిల్లలు–ఎదుర్కొనే సమస్యలు" అనే అంశంపై లక్ష్మీ సినర్జీ హై స్కూల్లో నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మాయిలు ఈ వయసులో ఎవరికి చెప్పుకోలేని అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇలాంటి సందర్భంలో అశాస్త్రీయమైన పాత పద్ధతులతో కాకుండా శాస్త్రీయ పరిజ్ఞానంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. నేటి విద్యార్థినిలే రేపటి మహిళలని కావున ప్రతి విషయంలో ఎంతో పరిపక్వతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అదే తమ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అమ్మాయిలు తమకు వచ్చే సమస్యలపై అడిగిన అనేక ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు నాగజ్యోతి, జెవివి నగర అధ్యక్ష కార్యదర్శులు తిరుపాల్, ప్రసాద్ రెడ్డి, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరులో భారీ వర్షం

మరువపారుతున్న చెరువు



నీట మునిగిన పంట

ప్రజాశక్తి-యల్లనూరు

మండల వ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో యల్లనూరు చెరువు మరువ పారుతోంది. ముఖ్యంగా పప్పుశనగ, సోయాచిక్కుడు, మొక్కజొన్న, తదితర పంటలు నీట మునిగాయి. అలాగే చీనీ పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లింది. వర్షానికి చెట్ల కిందే కాయలు రాలిపోయాయని చీనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

చిత్రావతి రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఉమ్మడి అనంతపురం జిల్లా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పార్నపల్లి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 600 కూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు రిజర్వాయర్ డిఇ చంద్ర సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే తరహాలో వరద వస్తే రిజర్వాయర్ గేట్లు అవకాశం ఉందన్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో 3వేల క్యూసెక్కుల వరద వస్తే గేట్లు ఎత్తుతామన్నారు. కావున పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వికలాంగుల కాలనీలో లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన



లైట్లు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

నార్పల : మండల కేంద్రంలోని వికలాంగుల కాలనీలో శుక్రవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. 'అంధకారంలో నార్పల వికలాంగుల కాలనీ' అని ప్రజాశక్తి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన మేజర్ పంచాయితీ కార్యదర్శి శ్యామల, పంచాయతీ కార్మికులతో కలిసి వికలాంగుల కాలనీలో లైట్లు ఏర్పాటు చేయించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాశక్తికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపిడిఒల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి



రాప్తాడు : అనంతపురం జిల్లా ఎంపిడిఒల సంఘం జిల్లా ఉపాధ్యాక్షురాలిగా రాప్తాడు ఎంపిడిఒ విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈసందర్భంగా రాప్తాడు ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, టిడిపి నాయకులు విజయలక్ష్మికి శుభాకాంక్ష లు తెలిపారు.

అసిస్టెంట్ సిటీప్లానర్‌గా నీరజాక్షి



అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీప్లానర్‌గా ఉద్యోగోన్నతిపై ఎ.నీరజాక్షి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం కమిషనర్ బాలస్వామిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఈమె ఇప్పటివరకు పుత్తూరు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పని చేస్తూ ఉద్యోగోన్నతిపై మున్సిపల్ కార్పొరేషన్‌లో నియమితులయ్యారు.

పోలియోపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారులు

రాయదుర్గం రూరల్ : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో పోలియో నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పోలియో వైరస్‌తో వచ్చే సంక్రమిక వ్యాధి అన్నారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. కావున పుట్టిన పిల్లలకు నిర్ధిష్ట వ్యవధిలో పోలియో టీకాలు వేయించడం ద్వారా నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఎఎన్ఎం పార్వతి, ఎంఎల్‌హెచ్‌పి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ప్రేమ్‌చంద్

నార్పల : మండల కేంద్రంలోని పశు వైద్యశాలను జేడీ ప్రేమ్‌చంద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక వైద్యాధికారిణి సాయి సుప్రజతో కలిసి పలు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. తర్వాత మండలంలోని పాడిపశువులు, గొర్రెలు మేకలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా గాలికుంట వ్యాధి టీకాలు ఎంతవరకు పూర్తయ్యాయనే వివరాలపై ఆరాతీశారు. పశువులు, గొర్రెలు, మేకలకు అంటువ్యాధులు ప్రబలకుండా కాలానుగుణంగా టీకాలు, మందులు ఇస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు పరిశీలన

గుత్తి : పట్టణంలోని గుంతకల్లుకు వెళ్లే రహదారి పనులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి రైల్వే వంతెన వరకు రహదారిలో మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడేవారు. చాలామంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో ప్రజాప్రతినిధుల చొరవతో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, ట్రాన్స్ కో ఎఇ కె.మధుసూదన్‌రావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనాయాదవ్ పరిశీలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

యాడికి : మండలంలోని ఫ్యాషన్ గ్రామం కోన ఉప్పలపాడు గ్రామంలో ఎఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా అక్కడ ఉన్న పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. తర్వాత గ్రామంలో శాంతిభద్రతల విషయమై సీఐ ఈరన్నతో చర్చించారు. గ్రామంలో సమస్యలు తలెత్తకుండా చూడాలని సిఐకి సూచించారు.

తాడిపత్రి రూరల్ : మండలంలో ఫ్యాక్షన్ గ్రామలుగా పేరుపొందిన వీరాపురం, ఆలూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌లను తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పికెట్‌లో ఉన్న కానిస్టేబుళ్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆయా గ్రామస్థులతో సభ ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలవకుండా ఉండాలని సూచించారు. తర్వాత గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

పోక్సో కేసు నిందితుడికి రిమాండ్

శింగనమల : పోక్సో కేసు నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన విషయాలను వెల్లడించారు. మండల పరిధిలోని సోదనపల్లి గ్రామానికి చెందిన బాలికను అదేగ్రామానికి చెందిన మంచాల నాగరాజు పెద్ద కుమారుడు హరిప్రసాద్ ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను గర్భవతిని చేశాడన్నారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్, ట్రైనింగ్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం : డిఎంహెచ్ఒ

అనంతపురం : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 24వతేదీన నిర్వహించే ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించి చుక్కలు వేయించాలన్నారు. 2014లో పోలియో రహిత దేశంగా ప్రకటించారని, ఇది ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు, ప్రజల సహకారంతో సాధ్యమైందన్నారు. అయినప్పటికీ, ప్రపంచంలోని కొన్ని దేశాల్లో ఇంకా పోలియో వ్యాధి ఉన్నందున జాగ్రత్తతోపాటు పూర్తి టీకా రక్షణ అవసరమన్నారు. కావున ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

తైక్వాండో ఛాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న 42వ రాష్ట్ర జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ ట్రోఫీ, పతకాలు, జ్ఞాపికలను ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో శ్రీరామరెడ్డి పసుపుల, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శాంతరాజ్, రామాంజి, రాజేష్, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో 'అనంత' విద్యార్థులు

అనంతపురం : ఈనెల 22 నుంచి 23వతేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన అండర్-19 అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనపరచి పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మీనాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు రవికాంత్ రమణ అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, కోచ్, మేనేజర్లు ఇబ్రహీం, భార్గవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు సంతాపం

అనంతపురం కలెక్టరేట్ : కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో బస్సులోనే చాలామంది ప్రయాణికులు సజీవదహనం కావడం అత్యంత దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మోటార్‌కు మరమ్మతులు

నార్పల : మండల పరిధిలోని రంగాపురం పంచాయతీ మూగే తిమ్మంపల్లి గ్రామంలో తాగునీటి మోటారుకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కుళ్లాయప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి కీర్తన, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పుస్తకాల వితరణ

అనంతపురం : ద్విభాషా కవి జూటూరి షరీఫ్ రాసిన 'చెట్టు' వచన కవిత్వ పుస్తకాలను పలు గ్రంథాలయాలకు ఉచితంగా అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం, మహిళ, బాలల గ్రంథాలయాలకు ఆయనే స్వయంగా వెళ్లి డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందు, మహిళా గ్రంథాలయ అధికారి శ్రీపతికి పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పండిట్ రియాజుద్దీన్ అహ్మద్, సాహిత్య భారతి వ్యవస్థాపకులు గుంటి మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ రాయలసీమ సాహిత్యంలో వచనశతకం రాసిన తొలికవి జూటూరి షరీఫ్ అన్నారు. ఆయన రచించిన 'చెట్టు' వచన శతకం ఎంతో వినూత్నమన్నారు. అనంతరం జూటూరు షరీఫ్‌ను పలువురు పాఠకులు, సాహితీ మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల సిబ్బంది ప్రవల్లిక, ముత్యాలమ్మ, శివమ్మ, శిరీష, ఉజ్జీశ్వేరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమం' పోస్టర్లు ఆవిష్కరణ



శింగనమలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ ఈనెల 28వతేదీన శింగనమలలో నిర్వహించనున్న ప్రజాఉద్యమం నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 28వతేదీన శింగనమలలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు ఆలూరు పరంధామరెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎన్‌వి నారాయణ, శ్రీనివాసులునాయక్, నియోజకవర్గ మండలాల కన్వీనర్లు, రాష్ట్ర అనుబంధ సంఘాల నాయకులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రాయదుర్గం : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి తలపెట్టిన ప్రజా ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు మెట్టు విశ్వనాథరెడ్డి, కె.ఉషారాణి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, కన్వీనర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టనున్న ర్యాలీకి సంబంధించి ప్రజా ఉద్యమ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, నాయకులు బోయ తిప్పేస్వామి, మాదినేని ఉమామహేశ్వరనాయుడు, దొడగట్ట నారాయణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

శింగనమల : మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో శుక్రవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా జెడి డాక్టర్ ప్రేమ్‌చంద్, జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, వైద్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.వెంకటేష్ ప్రారంభించారు. ఇందులో భాగంగా సుమారు 32 పశువులకు చూడి పరీక్షలు, 14 కట్టని పశువులు, 8 ఎండోమెట్రైటిస్‌తో బాధపడుతున్న పశువులకు చికిత్స చేశారు. తర్వాత వాటికి కావాల్సిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, విటమిన్ ఇంజక్షన్లు, మినరల్ ఇటుకరాళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పెయ్య దూడలు మాత్రమే పుట్టే వీర్యం అందుబాటులో ఉందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కుళ్లాయప్ప, సుధాకర్, పశుసంవర్ధక సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేయాలి

పుట్లూరు : మండలంలోని డీలర్లు అందరూ ఈనెల 26వ తేదీ నుంచి 65ఏళ్ల వయసున్న వారందరికీ ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని సిఎడిటి రాజా సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 1వతేదీ ఉదయం 6 గంటల నుంచే దుకాణాలు తెరవాలన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డుల్లో తప్పొప్పులు ఉంటే వీఆర్వోల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని గోళ్ల ఎస్‌సి కాలనీ, శీబాయి ఎస్‌సి కాలనీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం నుంచి స్పెషల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హర్షలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడురోజుల పాటు స్పెషల్ క్యాంపు ఉంటుందన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కళ్యాణదుర్గం రూరల్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డివిఎల్‌డిఒ నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం కంబదూరు మండలంలోని ములకనూరు గ్రామంలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని డివిఎల్‌డిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన

రాయదుర్గం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ సంస్థ, సర్పంచు హేమలత ఆధ్వర్యంలో శుక్రవారం గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించుదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా ఎలా జీవించాలనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠ, అకౌంటెంట్ లోకేష్, ఎఎన్ఎం నాగమణి, పంచాయతీ కార్యదర్శి మధు, చిత్తప్ప, తిప్పారెడ్డి, ప్రకాష్, ఆరోగ్య కార్యకర్త సుగుణ, అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, శాంతమ్మ, ఆశా కార్యకర్త సత్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెట్ మినహాయింపునకు ఉద్యమిస్తాం

అనంతపురం కలెక్టరేట్ : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వకపోతే ఉద్యమిస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేసి మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం పొందేటప్పుడు లేనటువంటి షరతు ఇప్పుడు విధించడం సబబు కాదన్నారు. 30 సంవత్సరాల సర్వీస్ అనంతరం టెట్ పరీక్ష ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న అందరూ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష పాస్ కావాలని నిర్ణయం పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు.

ఆర్‌బిఎస్‌కె మొబైల్ వాహన రవాణా సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్.బి.ఎస్.కె) మొబైల్ వాహనాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి దేవి శుక్రవారం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 18ఏళ్లలోపు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించిన పిల్లలతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు గుర్తించిన పిల్లలను జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి తరలించి చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి, డిఐసి మేనేజర్ రజిత, డెమో నాగరాజు, డిప్యూటీ డెమో త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

ఆలయాల అభివృద్ధికి కృషి : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణకు కృషి చేయనున్నట్లు విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాసమితి ఆధ్వర్యంలో రాయదుర్గంలో నిర్మించిన నూతన కళ్యాణ మండపాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి రుద్రయ్య శెట్టి 1960లో స్థలాన్ని కళ్యాణ మండపానికి ఉచితంగా ఇచ్చారని, నేడు తన హయాంలో ఇక్కడ కళ్యాణ మండపం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. జయంతి కుటుంబీకుల సహకారంతో కళ్యాణ మండపం ఏర్పడిందన్నారు. జిల్లాలోనే రాయదుర్గం సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమన్నారు. అందులో భాగంగా మురడి ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ చేపట్టినట్లు చెప్పారు. అలాగే లింగాల బండ చతుర్ముఖ పశుపతినాథుడి ఆలయంతో పాటు ఇతరత్ర ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తాయి రాజశేఖర్, కార్యదర్శి బిసా శ్రీనివాస్, సంఘ ప్రముఖులు ప్రకాష్ గుప్తా, రామ గోపాలకృష్ణయ్య శెట్టి, సురేష్ కుమార్, సత్యనారాయణ, రాధాకృష్ణ, రామరాజు, లక్ష్మణ శెట్టి, వెంకట రమేష్, టిడిపి నాయకులు టంకసాల హనుమంతు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

'ఉపాధి' నిధుల వాడకంపై విచారణ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని చాలువేముల గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ నిధుల వాడకంపై అధికారులు విచారణ చేపట్టారు. చాలువేముల గ్రామానికి చెందిన దత్తేశ్వర్‌రెడ్డి 2019లో ఉపాధి హామీ పనులతో రూ.57వేల మెటీరియల్ పనులు చేపట్టారు. ఈ పనులకు సంబంధించి 2022లో పంచాయతీ అకౌంట్‌కు ప్రభుత్వం డబ్బులు వేసింది. అప్పటి ఇన్‌ఛార్జి కార్యదర్శి అశ్వత్‌రెడ్డి ఆ డబ్బులను డ్రా చేసుకుని బదిలీపై వెళ్లాడు. దీంతో దత్తేశ్వర్‌రెడ్డి పలుమార్లు ఫోన్ చేసినా పట్టించుకోలేదు. దీంతో దత్తేశ్వర్‌రెడ్డి గత నెలక్రితం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో డివిఒ శ్రీనివాసులు, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఒ శుక్రవారం కార్యాలయానికి చేరుకుని దత్తాత్రేయని విచారించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌రెడ్డిని శనివారం సాయంత్రంలోపు డబ్బులు పంచాయతీలోకి వేయాలని, లేకపోతేపై చర్యలకు సిద్ధంగా ఉండాలని ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ తులసీప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విచారిస్తున్న అధికారులు